పొల్యూషన్

సాయంత్రం యిల్లుజేరిన రాజారావుకి గుమ్మంలో సరళ కన్పించక పోగానే ఆశ్చర్యమేసింది — ఆశ్చర్యంతో పాటు అనుమానం కూడ వచ్చింది— రోజూ అయితే ఆ వేళకు తలుపులు తీసుకుని భర్త గురించి ఎదురు చూసేది సళర—రాజారావు వచ్చాకనే కాఫీలు కలిపేది—అంతవరకూ ఆమె కూడి తాగే దికాదు.

తలుపుతట్టిన పది నిముషాల తర్వాత వచ్చి గడియతీసి వెళ్ళిపోయింది సరళ—ఈ మాటు రాజారావ్‌కి తన అనుమానం నిజమేమోనన్న నమ్మకం కలిగింది

సరళ ఎంచేతనో అలిగింది—లేకుంటే ఎందుకలా ముఖం చాటేసుకు తిరుగుతుంది? కాఫీ యివ్వకపోతేపోయె కనీసం మాట్లాడ్డానికేం?

ఆఫీసులో కష్టపడి యింటికి వచ్చిన మగాడిని విసిగించకూడదన్నైనా వుండదు కాబోలు యీ ఆడవాళ్ళకి.

రాజారావు తన మనసులో రగులుతున్న ఆలోచనలను అక్కడితో ఆపాడు—ఆడదానికి అందునా శ్రీమతికి అలకొచ్చినా కోపమొచ్చినా మగాడికి ఎటువంటి ఆలోచనలు పనికిరావు. ఆమె కోపానికి తట్టుకోవాలి. యేమన్నా పడాలి చిరునవ్వుతోనే జవాబు చెప్పాలి— ప్రేమతో లాలించాలి—లేకపోతే ఆనాటి నుంచి నాలుగు రోజుల వరకూ పిల్లి పొయ్యిలోనూ, తాము విడివిడిగానూ పడు

కోటం తప్పదు !

ఈజీ చైర్‌లో కూర్చుని ఆలోచిస్తున్న రాజారావుకు ఎదురుగా కాఫీకప్పుతో నిలిచిన సరళనిచూస్తే ఆశ్చర్యమేసింది కాఫీ కప్పు అందుకుంటూ ఆమె ముఖం లోకి చూశాడు. గాఢ నిద్రపోయి లేచిన తర్వాత వుండే కళ్ళలా ఆమె కళ్ళు వుబ్బి వున్నాయి—తెల్లటి ఆ బుగ్గల మీద చారలు స్పష్టంగా కన్పించాయి.

కాఫీ కప్పును క్రిందపెట్టి మృదువుగా ఆమె చేతిని తనచేతిలోకి తీసు కున్నాడు రాజారావు,

"నన్నొదలండి—నా కవతల బండెడు చాకిరీ వుంది. మీతో సరసాలాడ్డా నికి నా కెలా కుదుర్తుంది" అంటూ తప్పించుకుని వెళ్ళిపోయింది సరళ - ఆమె కంఠంలో మునుపున్న సరళత కన్పించలేదు.

ఎంత ఆలోచించినా ఆమె కోపానికి కారణమేమిటో వూహించలేక పోయాడు రాజారావు.

స్నానంచేసివచ్చి వంటింట్లో ఆమె కెదురుగా పీట వాల్చుకు కూర్చు న్నాడు. సరళ అదేం పట్టించుకోనట్లు తన పనిలో తాను నిమగ్నమైపోయింది.

"మా సరళాదేవికి సినిమా చూపించి ఎన్నాళ్ళయిందో—వెళ్తే బాగుణ్ణు" అన్నాడు ఆమెవైపు చూసి.

సరళ వెనక్కు తిరిగి ఎర్రగా చూసింది—ఆదే అదను చేసుకుని రాజా రావు చిన్న నవ్వునవ్వి

"ఏం వెళ్దామా" అన్నాడు.

"నా కదొక్కటే తక్కువైంది- అయినా పెళ్ళాంకోచీరకొనాలనీ, సినిమా చూపించాలనీ, పువ్వులు తేవాలనీ ఒకరు చెబితేగాని తెలియని మీలోయింత మార్పు రావటం నా అదృష్టమే—" అంది వెటకారంగా

రాజారావు వున్నఫళంగా లేచివెళ్ళి సరళ రెండు భుజాల్నీ తన చేతుల్లో బిగించి ఆమెను తన వైపుకు తిప్పుకున్నాడు

,,ఏమిటో చాల వేడిమీదున్నారు అమ్మాయిగారు!" అన్నాడు.

,,వయసులోని యీ వేడీ యీ కోరికలూ మీకు పనికిరావుగా — ఎంత సేపూ మీరు చెప్పినట్లు చెయ్యాలి మీ మాటలు వింటూ మీ చేతిలో కీలుబొమ్మ అవ్వాలి. అప్పుడే మీకు సంతృప్తి '' అంది—ఉక్రోషంగా.

గాలి తనమీదకు మళ్ళిందని తెలియగానే రాజారావుకి అసలు సంగతి అర్థమైంది. సరళ చిరకాల స్నేహితురాలు వనజ వచ్చి వుంటుంది — వచ్చింది వచ్చినట్లుండక వాళ్ళాయనగారికి జీతమెంత పెరిగిందో, తనకెన్ని చీరలు కొన్నారో, యింట్లో యేయే సామానులు కొన్నదో అన్నీ చెబుతుంది. ఆమెకదే పని. పైగా ,గేస్‌స్టవ్' ,కుక్కరూ' లేనిదే వంటేమిటమ్మా అంటుంది — మీరు విమ్ వాడరూ? అని ఆశ్చర్యపోతుంది. డబుల్ కాట్ బెడ్ లేకుంటే నా కసలు నిద్రపట్టదు—' ఈ ధోరణిలో సాగుతుందామె సంభాషణ.

ఆ మధ్యవాళ్ళ చుట్టాల పెళ్ళికిసరళ వెళ్తే తీసుకొచ్చేందుకు తనువెళ్ళిన ప్పుడు విన్నా డామె మాటలు కాకపోయినా మనిషి తత్వం తెల్సుకోవడ మెంతసేపు?

,ఏయ్ సరళా—మనం దెబ్బలాడుకోటం మాటకేంగాని వెళ్దామా వద్దా చెప్పు—" అన్నాడు నెమ్మదిగా.

"నేనేం దెబ్బలాడాను? అయినా నా మొహం ఎప్పుడూ మీ కళ్ళకలాగే కన్పిస్తుంది — నలుగురిలో కెళ్ళేటప్పుడు మంచి చీర కావాలనడం మీ దృష్టిలో తప్పు— అంతేగా? అటువంటి కోరికలు నేనుకోరకూడదు నెలకు అరొందలు తెచ్చుకుంటున్న వాడిపెళ్ళాం ఎలా వుండాలో మీకు తెలియక పోయినా నాకు తెల్సు, నేనే భర్తయి మీరేభార్య అయితే నేనెలా చూసేదాన్నో మీకు తెలిసేది!"

ఈ మాటకు రాజారావుకి నవ్వాగలేదు.

సరళకి ఫుల్ వాయిల్ చీరమీదకంటె నైలెక్స్ చీరమీద, నైలెక్స్ చీర కంటె కోలీసింథ్ చీరమీద మక్కువ ఎక్కువన్న సంగతి తనకు తెల్సు. జీతం ఆరొందలన్నమాటేగాని చేతికొచ్చేది రెండొందలకు మించదు. ఇంటద్దెకు, బాకీలకూ పోగా పదోతారీకుక్క పైసామిగలదు. కాని అపాటిదానికే ఆరొందలు తెచ్చుకొంటున్నామని గర్వపడ్డం రాజారావు కిష్టంవుండదు.

సరళమాత్రం హోదాగా వుండాలంటుంది—చీరలంటుంది-నగలంటుంది స్టీలు గిన్నెలంటుంది—గేస్ పొయ్యి అంటుంది.

రాజారావు అన్నిటికీ సరే నంటూనే వాయిదాలు వేస్తాడు.

"నాకీసారి కోలీసింథ్ చీర కొంటేనే మీతో సిన్మాకి రావటం - అంత వరకూ రాను. నన్ను పిలవకండి—"అంటూ వెళ్ళిపోయింది సరళ.

లేచి పడకగదిలోకి వచ్చి రాజారావుకి వనజ వచ్చి వెళ్ళినట్లు నిర్ధారణ అయింది. హార్లిక్స్ తాగిన ఎంగిలి కప్పులు అక్కడే వున్నాయి. తనకంటె గొప్పవారొస్తేనేగాని హార్లిక్స్ కలపదు సరళ - నీరసంగా వున్నా తను తాగదు ఒకరి దగ్గరైనా మనకు గౌరవం వుండక పోతే ఎలా అంటుంది.

వచ్చే జీతంలో శక్తికి మించిన పరుగులు పెట్టకూడదని ఎలా చెప్పాలో ఆమెనెలా మార్చాలో ఎప్పటికీ అర్థంగాని సమస్యయింది రాజారావుకి.

ఆరోజుకిక ఎవ్వరూ మాట్లాడలేము రాజారావుకి భోజనంపెట్టి తను తిన కుండానే లైటార్పి పడుకుంది సరళ - మనసులో వున్నా యేమి అనలేక వూరుకున్నాడు రాజారావు

భార్యాభర్తల మధ్య ఎన్ని భేదాభిప్రాయాలున్నా మళ్ళీ కలిసిపోవటం సహజం. వారం రోజుల్లో మళ్ళీ మామూలు మనుషులైపోయారు సరళా, రాజా

రావు. కాని రాజారావు మనసులో ఆరాంటం పోలేదు.

శనివారం పుదయం ఆఫీసుకు వెళ్తూ "అన్నట్టు సరళా నీకు చెప్పడమే మరచిపోయాను. నా చిన్ననాటి స్నేహితుడు గోపాల్ నిన్న కనిపించాడు. పుద్యోగం లేదట—అత్త వారి దీ పూరేనట. అయ్యో అనిపించినా యేం చేయగలం చెప్పు. పుద్యోగం లెకుండా పెళ్ళిచేసుకోవడమే తప్పు. మా యింటికో సారి రారా అన్నాను." రాజారావు మాట పూర్తి కాకుండానే.

"అయ్యో మీ స్నేహం బంగారంగానూ, పోనీ ఆదివారం కదా భోజనానికైనా ఆ యిల్లాలితో రమ్మనలేక పొయ్యారూ?" అంది సరళ.

"అదేఅదే - ఆ మాటే అందామనుకున్నాను. కాని నువ్వేమంటావో నని—" నసిగాడు రాజారావు.

"నే నెప్పుడైనా మీ యిష్టానికడ్డొచ్చానా చెప్పండి - యిప్పుడైతేనేం పిలవండి" అంది.

ఎగిరి గంతేసి వెళ్ళిపోయాడు రాజారావు.

*　　*　　*

ఆ రోజే యిల్లు కడిగి సదులన్నీ శుభ్రంగా సర్దింది సరళ - అల్మారాలో సామానంతా నీటుగా అమర్చింది. ఫోటోలు తుడిచి యథాస్థానంలో వుంచింది. ముందు గదిలో టేబుల్‌మీద కొత్త గుడ్డ వేసి కుర్చీలు చక్కగా అమర్చింది. వంటింట్లో డబ్బాలన్నీ సర్దిస్టౌవ్‌లు ఎత్తుగా పెట్టుకుంది - పిసిపిల్లను పెందరాడే రమ్మని ఆర్డరు జారీచేసింది.

ఆ సాయంత్రం రాజారావుకు ఇంట్లో చాలా మార్పులు కనిపించాయి యిద్దరొస్తున్నారంటే పదిమందికి సరిపడ హడావుడి చేస్తుంది సరళ - వాళ్ళ ముందు తమ హోదా అంతస్తులను చూపాలనే ఆమె తాపత్రయం.

మారు మాట్లాడకుండా తనలో తనే నవ్వుకుని వూరుకున్నాడు రాజారావు

*　　　*　　　*

"అబ్బబ్బబ్బ! యింకా నిద్రలేవలేదూ?" అంటూ వచ్చిన సరళ కేకకు కళ్ళువిప్పి చూశాడు రాజారావు స్నానంచేసి మంచిచీర కట్టుకొని మల్లెపువ్వులా తయారైంది సరళ — లేచి దంతావధానం చేసుకునేసరికి టేబుల్ మీద కాఫీ, దానితోపాటు డైలీ పేపరు రెడీగా వున్నాయి.

స్నానం చేసి వస్తూ వంటింట్లోకి తొంగి చూసిన రాజారావుకి సరళ యిడ్లీప్లేట్లు క్రిందికి దించుతూ కన్పించింది.

"భారీయేర్పాట్లే !" అనుకున్నాడు మనసులో—

తొమ్మిది అయ్యేసరికి గోపాలం, అతని భార్య లత రానేవచ్చారు. ముందుగదిలో కాస్సేపు కూర్చుని పరిచయాలూ, మాటామంతీ అయ్యాక టిఫిన్ అందించింది సరళ—

"నాకిక్కడెందుకండీ-నేనూ లోపలికొస్తా" అంది లత.

మాయింట్లో అటువంటి మొహమాటాలేం లేవు అని సరళ అంటున్నా తన ప్లేటును పట్టుకుని లోపలికి వచ్చేసింది లత.

మగాళ్ళిద్దరూ ముందుగదిలో మాటల్లో పడ్డారు.

కాఫీ లయ్యాక లతకు యిల్లంతా చూపించింది సరళ

"ఈ మాత్రం పోర్షనన్నా లేకపోతే తోచదు సుమండీ — బాత్‌రూమూ లేవట్రీ సెపరేట్‌గా లేకపోతే అసలు కుదరదుమాకు. నూటపాతిక యిస్తున్నాం' అంటూ మొదలుపెట్టి తను ఆమెముందు ఎంత గొప్పదో నిరూపించే అన్ని ప్రయత్నాలూ చేసింది సరళ అంతావిన్న లత తన గోడు మొదలు పెట్టింది.

"యేమిటో వదినగారూ - అన్నయ్యగారికి వుద్యోగముండ బట్టి నాలుగూ

కొనుక్కొని హాయిగా వుండగలుగుతున్నారు, పైవారిని పైసా అడగక్కరలేదు.

మీ అన్నయ్యగారి పరిస్థితి చూడండి— ఏ ఒక్క వుద్యోగాన్నీ నిలబెట్టు కోరు— తన చదువుకి, హోదాకి తగిన వుద్యోగం రాలేదని అన్నిటినీ విడిచి పెట్టేస్తున్నారు. చూడండి! మా యింట్లో ఒక విలువైన సామానులేదు—అమ్ము కుందికన్నా ఒక నగలేదు — యేమైనా సంసారం మగవాడిమీద ఆధారపడి వుంటుంది—మగవాడు స్థిరమైనవాడైతే ఆడదానికి అంతకంటె అదృష్టమేముం టుంది? స్థిరత్వమంటూవుంటే పెళ్ళానికి కొనేచీర దగ్గరనుండి స్వంతానికో యిల్లు కట్టుకునే వరకూ అన్నీ స్వయంగా చూసుకుంటారు — ఉన్న దాంట్లోనే క్లుప్తంగా గడుపుతారు.

మీ అన్నయ్యగారలాకాదు. ఈ రోజువంద తెచ్చారంటే అవి ఆర్పేసే వరకూ నిద్రపట్టదాయనకు ఇక ఫ్రెండ్సుతో సినిమాలకు వెళ్తే గొప్పకోసం పదులూ పాతికలూ ఖర్చుచేస్తారు. యింట్లో బియ్యం లేవని తెల్సినాకూడా చూడండీ మనం ఆడవాళ్ళం — మనమే యేదో పొదుపు చెయ్యాలి. వాళ్ళ దుబారాని అరికట్టాలి ఈ మాటపైకంటే ఆయనకు కోపం - "నేనేం దుబారా చేశాను." అంటారు. మీరే ఆలోచించండి. పుట్టింది ఆడపిల్ల - రేపుదాని బాధ్య తంతామోసి దాని ముద్దూ ముచ్చటా ఎవరు చూస్తారు చెప్పండి? ఈ చీర చూడండి నూటనలభై పెట్టి కొన్నారు - ఇంతకు ముందు చేసే వుద్యోగం వూడినప్పుడు చేతికొచ్చిన మూడొందలుపెట్టి యీ చీరకొన్నారు - అయనో టెర్లిన్ జతకుట్టించుకున్నారు. వద్దని అనను - కానీ మన పరిస్థితి కూడ చూసు కోవాలి కదండీ"

లతమాటలు వింటూంటే సరళలో కొంత చైతన్యం కలిగింది. లత చెప్పి నది నిజమే—

మగవాడి అండలేకపోతే ఆడదెందుకు పనికొస్తుంది? అలాగే స్థిరత్వం లేని మగాడితో చేసే కాపరంకంటె ఆడదానికి నరకమే మేలు !

భోజనాలై వాళ్ళు వెళ్ళిపోయినా లత మాటలే సరళ మనస్సులో నాటు

కుని బలంగా పనిచేయడం మొదలుపెట్టాయి.

అన్ని విధాలా తనకు అనువైన భర్త లభించాడు. కానీ తనే పైపై ఆశలకులోనై జీవితాన్ని నరకం చేసుకుంటూంఏమో ననిపించింది.

ఆ రాత్రి ఒంటరిగా పడుకున్న రాజారావుని గట్టిగా ప్రేమతో హత్తుకుంది సరళ — నిద్ర వస్తున్న రాజారావుకి పరిస్థితి అర్థమై నవ్వుకున్నాడు— స్నేహితుడి యుక్తి పనిచేసినందుకు సంతోషించాడు — అలా ఒకరికొకరు దగ్గరైన రాజారావూ సరళా మరి జీవితంలో వేరుకాలేదు.

(జనవరి 74—యువ)